క్లుప్తంగా

కొనసాగుతున్న ఆళ్వార్ల ప్రవచనాలు



వెంకటాచార్యులను సన్మానిస్తున్న రాఘవాచార్యుల దంపతులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బైపాస్ రోడ్డు శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో ద్వాదశ సూరుల(ఆళ్వార్ల) వైభవ ప్రవచన కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం నర్సాపురానికి చెందిన విద్వాన్ వంగల వెంకటాచార్యులు భూతయోగి, పూదత్తాళ్వార్, ఖమ్మంకు చెందిన కండ్లకుంట కోదండరామాచార్యులు నమ్మాళ్వార్‌ల గురించి, విశాఖపట్నానికి చెందిన విద్వాన్ భాష్యం శ్రీనివాసాచార్యులు విష్ణుచిత్తులు, పెరియాళ్వార్ గురించి, బెంగుళూరుకు చెందిన ప్రవచనమణి కె.జానకి గోదాదేవి వైభవం గురించి వివరించారు. ఈ సందర్భంగా వంగాల వెంకటాచార్యులను శ్రీ వైష్ణవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేదాంతం రాఘవాచార్యులు, స్వర్ణ దంపతులు సన్మానించారు.

మాల న్యాయవాదుల అసోసియేషన్ ఆవిర్భావం



ఎన్నికైన అసోసియేషన్ కార్యవర్గం

ఖమ్మంలీగల్: ఇండియన్ మాల న్యాయవాదుల అసోసియేషన్(ఐఎంఎల్ఏ) ఏర్పాటైంది. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడులో శనివారం న్యాయవాదులు సమావేశమై కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐఎంఎల్ఏ అధ్యక్షుడిగా రెంటాల ఆనంద్, ఉపాధ్యక్షుడిగా పి.బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మర్రి ప్రకాష్, సహాయ కార్యదర్శిగా పప్పుల రత్నాకర్, కోశాధికారిగా కొనకంచి శ్రీచరణ్‌ను ఎన్నుకోగా గౌరవ సలహాదారులుగా పల్లా రాజశేఖర్, పీఏజే.శేఖర్‌రాజు, క్రిస్టోఫర్ మోజెస్, సభ్యులుగా గోరింట్ల శాంతారావు, పిడతల రామ్మూర్తి, గుడిసె అనిల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన బాటలో నడుస్తూ ఐక్యంగా ఉంటూనే సమాజానికి అండగా నిలవాలని సూచించారు.

జెండా దిమ్మెను కూల్చడం సరికాదు

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం గ్రామంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జెండా దిమ్మెను అధికారులు కూల్చివేయటం సరైన చర్య కాదని ఎమ్మార్పీఎస్ నాయకులు వంగూరి ఆనందరావు అన్నారు. ఈ మేరకు శనివారం గ్రామంలో కూల్చిన జెండా దిమ్మెను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీలో ఎలాంటి అసౌకర్యంగా లేనప్పటికీ అధికారులు కావాలనే కూల్చి వేశారన్నారు. అదే స్థలంలో జెండా దిమ్మెను నిర్మించేందుకు సంఘం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్టపింజర బాలస్వామి, వెంకన్న, పులిపాటి ప్రకాష్, ప్రసాద్, హనుమంతరావు, వీరస్వామి, ఎల్లయ్య ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర: పార్ట్ 1
వినోద	లక్కీభాస్కర్
సాయిరాం	బఘీర
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	అమరాన్
సినీ గెలాక్సీ	అమరాన్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	3
వంకాయ	50		20
బెండకాయ	40	పాలకూర	3
పచ్చిమిర్చి	48		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	48	తోటకూర	3
దొండ	28		20
పొట్లకాయ	40	గోంగూర	5
చిక్కుడు	70		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	38		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		40
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	78		25
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

నగరం నడిబొడ్డున మురికికూపం

- మురుగుమయంగా మారిన ఖమ్మం మేజర్–2 సాగర్‌కాల్వ
- చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండి దుర్వాసన
- భరించలేక గగ్గోలు పెడుతున్న పరీవాహక ప్రజలు



కాల్వలో పెరిగిన పిచ్చిమొక్కలు



మురుగు, చెత్తాచెదారంతో ఆనవాళ్లు కోల్పోతున్న కాల్వ

ఖమ్మంఅర్బన్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అనారోగ్యాలు దరిచేరవని పదే పదే అధికారులు, పాలకులు చెబుతుంటారు. కానీ వాటిని అమలు చేయాల్సిన అధికారులు మాత్రం ఎక్కడికక్కడ వదిలేయడంతో ఆ మురుగుకు, వాటి ద్వారా వచ్చే విషజ్వరాలు, అంటురోగాలకు బాధ్యత ఎవరని నివాసులు ప్రశ్నిస్తున్నారు. నగరం నడిబొడ్డున లకారం వాకింగ్‌ట్రాక్ చెరువులోకి నీరు తరలించేందుకు మాత్రం వినియోగిస్తున్న సాగర్‌మేజర్ కాల్వ–2 పరిధిలో సాగు ఆయకట్టు మొత్తం రియల్ వెంచర్లుగా మారాయి. దీంతో సాగర్ ప్రధానకాల్వ నుంచి లకారం బ్యూటిఫికేషన్ ట్యాంక్ వరకు మాత్రం కాల్వ ఆనవాళ్లు ఉన్నాయి. మిగిలిన ప్రాంతంలో కాల్వ గుర్తులు లేకుండానే పోయాయని చెప్పవచ్చు.

ఆక్రమణలు.. ఆపై క్రమబద్ధీకరణ

అనేక చోట్ల ఆక్రమించి 59 జీఓలతో రెగ్యులర్ చేయించుకున్నారు. మరికొంత భాగం పార్కులుగా అభివృద్ధి చేశారు. మరికొన్ని చోట్ల దేవాలయాలు, చర్చిలు, మసీదుల నిర్మించారు. మిగిలి ఉన్న కాల్వ నగరం నడిబొడ్డున 10, 12 డివిజన్లలో నివాసాల మధ్య నుండి వెళ్తుంది. 10వ డివిజన్ చైతన్యనగర్‌లో మాత్రం మేజర్ కాల్వకు ఇరువైపుల రిటెనింగ్ కాంక్రీట్ వాల్స్ నిర్మించారు. మమత రోడ్డు క్రాసింగ్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు మట్టి కాల్వగానే కొనసాగుతుంది. తర్వాత కొంతభాగం చెరువు వరకు సిమెంట్ పైపులు వేసి ప్రస్తుతం బ్యూటిఫికేషన్ ట్యాంక్‌కు నీరు అందించుతున్నారు.

పట్టించుకోని రెండు శాఖలు..

కాల్వ జలవనరుల శాఖకు, కార్పొరేషన్‌కు సంబంధించిందిగా ఉండటంతో రెండు శాఖల అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. మిగిలిన మట్టి కాల్వను కనీసం రెండు వైపుల రిటైనింగ్ వాల్స్ నిర్మాణం చేస్తే మురుగు సమస్య తగ్గుతుందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు తమ బాధలను గుర్తించి మురుగు నీటి నిల్వలు లేకుండా కంప, పిచ్చిచెట్లు తొలగించి మురుగు బాధల నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..



నిలిచిన మురుగునీరు

మమత రోడ్డు నుండి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ఉన్న కాల్వ మొత్తం కంపచెట్లు, పిచ్చి మొక్కలు, వివిధ రకాల వ్యర్థాలతో మురుగు కాల్వగా మారింది. ఈ కాల్వలో నీటి ప్రవాహం లేని సమయంలో కూడా మురుగు నీరు నిల్వలు ఉండటంతోపాటు, వ్యర్థాలు కలిసి భరించలేని కంపుమయంగా మారిందని నివాసులు వాపోతున్నారు. కాల్వను ఆనుకొని నివాసముంటున్న వారు నిత్యం కంపుతో ముక్కులు మూసుకోని ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం



డివిజన్ మధ్యలో నివాసాల మధ్య నుంచి మేజర్ కాల్వ ఉండటంతో కంపచెట్లు పెరిగి మురుగుమయంగా మారుతోంది. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఎప్పుడో ఒకటి ఆరా ఏడాదికి ఒకసారి జేసీబీ ద్వారా శుభ్రం చేస్తారు. మురుగుకు మాత్రం శాశ్వత పరిష్కారం చూపించాలి.

– చిరుమామిళ్ల లక్ష్మి, 12వ డివిజన్ కార్పొరేటర్

పేరుకే మేజర్ కాల్వ



మా కాలనీ మధ్యలో ఉన్నది పేరుకే మేజర్ సాగర్ కాల్వ. అక్కడ పరిస్థితి మాత్రం మురుగు కాల్వగా ఉంది. మురుగునీరుతోపాటు, చెత్త పేరుకుపోయి దోమలు, పందులు సైర్వవిహారం చేస్తున్నాయి. చుట్టూ పెద్ద భవంతులు మధ్యలో మాత్రం మేజర్‌కాల్వ మురుగుమయంగా ఉంది. అధికారులు, పాలకులు దృష్టి పెట్టి బాగుచేయాలి.

– మేదరమెట్ల రాము, డివిజన్ వాసి

రిటైనింగ్ వాల్స్ నిర్మిస్తే ఉపయోగం



మేజర్ కాల్వకు మొదటిలో చేసిన విధంగా రిటై నింగ్ వాల్స్ నిర్మాణం చేయాలి. అవసరం ఉన్నచోట పైపులైన్లు వేసి కాల్వబయట కనపడకుండా ఉంటే మురుగు సమస్య ఉండదు. ఇలా ఉండటంతో లకారానికి నీరు వదిలినప్పుడు నీరు కూడా చెరువులో కలుషితం అవుతుంది. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోని బాగు చేయాలి.

– జి.వినయ్, డివిజన్ వాసి

12న సామూహిక వ్రతాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ శ్రీ వెంకటేశ్వర గోశాలలోని మండపంలో ఈ నెల 12న కార్తీక మాసం పురస్కరించుకొని ప్రత్యేకంగా సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు గోశాల నిర్వాహకుడు, ప్రధాన అర్చకుడు ఆరుట్ల శ్రీనివాసచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్రతంలో పాల్గొనేవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, పూజకు ఎలాంటి రుసుము లేదని, సామాగ్రి తెచ్చుకోవాలని పేర్కొన్నారు. .

నేడు ఉచిత వైద్యశిబిరం

ఖమ్మంవైద్యవిభాగం: పొంగులేటి స్వరాజ్యం, రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ (పీఎస్ఆర్) ఆధ్వర్యంలో ఖమ్మం కిమ్స్ హాస్పటల్ సౌజన్యంతో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నేలకొండపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రముఖ వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపింది. మండల వాసులు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరింది.

సేకరించిన నగదు ఇప్పించాలి



కుమారుడితో మధు దంపతులు

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యుత్ ప్రమాదంలో తమ కుమారుడు గాయపడగా వాట్సాప్‌లో పోస్ట్ చేసి దాతల నుంచి సేకరించిన నగదును పూర్తిగా ఇప్పించాలని ఖమ్మం రూరల్ మండలం శ్రీసాయిగణేష్‌నగర్‌కు చెందిన మధు, శోభ దంపతులు కోరారు. ఖమ్మంలో శనివారం వారు మాట్లాడుతూ.. తమ కుమారుడి చికిత్సకోసం కొందరు విరాళాలు సేకరించగా దాదాపు రూ.10 లక్షలు వస్తే రూ.1.22 లక్షల మాత్రమే తమకు ఇచ్చారని వాపోయారు. ఇదేమిటని అడిగినందున ఇంటి నుండి ఖాళీ చేయించారని, ఇకనైనా నగదు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

సవరణను సద్వినియోగం చేసుకోండి



పోలింగ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఆర్వో రాజేశ్వరి

నేలకొండపల్లి: ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలేరు డివిజన్ ఎన్నికల అధికారి రాజేశ్వరి సూచించారు. శనివారం మండలంలోని సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లి పోలింగ్‌కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన వారు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వే తరువాత ప్రకటించిన ముసాయిదా జాబితా లో అభ్యంతరాలు ఉంటే బీఎల్ఓలకు తెలియజేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి సవరణలు, మరణించిన వారి వివరాలు తొలిగించాలన్నారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుతో అర్హత ఉన్న వారు సద్వినియోగం చేసుకుంటారన్నారు. ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.మానిక్ రావ్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: సంక్షేమ హాస్టళ్లతో పాటు గురుకులాలకు కొత్త భవనాలు నిర్మించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ కోరారు. శనివారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంకు తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బీసీ సంక్షేమ హాస్టళ్లు శిథిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. గురుకులాల్ని అద్దె భవనాలలో నడపటంతో విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు రాజేందర్, భూపేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం



స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న పోతినేని సుదర్శన్

ఖమ్మంఅర్బన్: దేశంలో బీజేపీ హిందూ మతోన్మాదాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తుందని, అయోధ్యలో జరిగిన ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూసిన బీజేపీ అభ్యర్థిని ప్రజలు తిరస్కరించారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు విమర్శించారు. 2005లో మణుగూరులో జరిగిన సీపీఎం జిల్లా మహాసభలకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆరుగురు జ్ఞాపకార్థంగా నిర్మించిన స్థూపాన్ని శనివారం ఖానాపురం హవేలీ మండల మహాసభలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రెండోసారి అధికారంలోకి వచ్చిన మోదీ నల్లధనం వెలికితీయపోగా దేశ సంపదను దోచుకున్న బడా పెట్టుబడిదారులకు కాపాడే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలుచేయడం లేదని కులగణన పేరుతో ప్రజల సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. అనంతరం పార్టీ నూతన కమిటీని ఎన్నుకోగా మండల కార్యదర్శిగా దొంగల తిరుపతిరావును ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణ వెంకటేశ్వర రావు, వై.విక్రం, బుగ్గవీటి సరళ, జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి రమ్య, ఎర్ర శ్రీనివాసరావు, రాళ్లపల్లి కృష్ణ, బండారు రమేష్, నాయకులు పెద్ది నాగయ్య, పారుపల్లి ఝాన్సీ, నవీన్ రెడ్డి, జబ్బార్ పాల్గొన్నారు.

కవులకు సత్కారం



కవి కట్టెకోలను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత్ కల్చరల్ అకాడమి, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం సంయుక్తంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం నిర్వహించిన ప్రజాకవి కాళోజి కవితల పోటీల్లో ఖమ్మం కవులను నిర్వాహకులు సత్కరించారు. ప్రముఖ కవయిత్రి రత్నలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఖమ్మం కవులు కట్టెకోల చిన నర్సయ్య, రావిరాల బుచ్చయ్య, కేశవరాజు వేంకట ప్రభాకరరావు, టి.కరుణలు పాల్గొన్నారు. కవి కట్టెకోల 'యుద్ధం ప్రశ్నార్థకం' శీర్షికన రచన చేసి కవితను ఆలపించి సభికుల మెప్పుపొందారు. ఈ కార్యక్రమంలో భారత్ కల్చరల్ అకాడమి, తెలుగు టెలివిజన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగబాల సురేష్ కుమార్, ఇనుముల ప్రేమ్‌రాజ్, మౌనశ్రీ, మల్లిక్, సాధనాల వెంకటస్వామి నాయుడు, ఫణిందర్ రావు, రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి..



కామేపల్లి: సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్



నేలకొండపల్లిలో..



కూసుమంచిలో..



తిరుమలాయపాలెం: కాకరవాయిలో..



రఘునాథపాలెం: చింతగుర్తిలో..

కామేపల్లి: మండలంలో సమగ్రంగా ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టాలని తహసీల్దార్ సుధాకర్ ఎన్యూమరేటర్లకు సూచించారు. మండలంలోని పండితాపురంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడారు.. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

నేలకొండపల్లి : మండలంలో శనివారం సర్వే ప్రారంభించారు. మండలంలోని 32 పంచాయతీల్లో 20,270 ఇళ్లను సర్వే చేయనున్నారు. ఇందుకుగాను, 149 బ్లాకుల్లో 139 మంది ఎన్యూమరేటర్స్ సర్వేను ప్రారంభించగా 13 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షించారు. తహసీల్దార్ మానిక్‌రావ్, ఎంపీడీఓ యం.యర్రయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ సూపర్‌వైజర్ టి.గురవయ్య, ఎన్యూమరేటర్లు గోపి, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: సమగ్ర కుటుంబ సర్వే శనివారం మండలంలో ప్రారంభమైంది. తొలిరోజు 597 కుటుంబాలను ఎన్యూమరేటర్లు సర్వే చేసినట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన కూసుమంచిలో సర్వే తీరును పరిశీలన చేసి తగు సూచనలు చేశారు.

తిరుమలాయపాలెం: ఇంటింటి సర్వే మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 22,328 కుటుంబాలను గుర్తించి సర్వే చేపట్టినట్లు తహసీల్దార్ పీవీ.రామకృష్ణ తెలిపారు. మొత్తం 40 పంచాయతీల్లో అన్ని గ్రామాల్లో కలిపి 184 బ్లాక్‌లుగా విభజించి 148 మంది ఇన్విజిలేటర్లు 17 మంది సూపర్వైజర్లు సర్వేలో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. ఆదివారం నుంచి గ్రామాల్లో బీఎల్వోలు కూడా పాల్గొని కొత్త ఓట్లు, మార్పులు చేర్పులు, మరణించిన వారి వివరాలను సేకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రఘునాథపాలెం: సర్వే ప్రక్రియ మండలంలో ప్రారంభమైంది. 17 వేల సర్వే పామ్స్ కావాల్సి ఉంటే మండలానికి 1,800 మాత్రం వచ్చాయి. వచ్చిన వాటిని 122 మంది ఎన్యూమనేటర్లుకు అందించి సర్వే ప్రారంభించినట్లు ఎంపీడీఓ అశోక్ తెలిపారు. మొదటిరోజు 494 పైగా ఇళ్ల సర్వే పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో యాజమాన్యం, కంపెనీల ప్రతినిధులు

ఖమ్మం సహకారనగర్: అకాడమర్, టీచ్‌నూక్ కంపెనీలకు 46 మంది ఉద్యోగాలకు వారి విద్యార్థులు ఎంపికైనట్టు ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు శశికుమార్, సాయి ప్రదీప్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, గుండాల ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇరువర్గాల పంచాయితీ

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లిలో శనివారం ఇరువర్గాల మధ్య పంచాయితీ జరిగింది. ఇంటిస్థలాల మధ్య ఇరువర్గాల వారు శనివారం ఘర్షణకు దిగటంతో పాటు తలపడ్డారు. అదే విధంగా పోలీస్‌స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు.

సమస్యలపై ఉద్యమాలను కొనసాగిద్దాం



తిరుమలాయపాలెం: నివాళులర్పిస్తున్న నాయకులు

కామేపల్లి: ప్రజా సమస్యలపై అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలను కొనసాగిద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం అమరవీరులకు నివాళులర్పించారు. డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌వీ.రాకేష్, నాయకులు మంగీలాల్, కిషన్, సామ్యా, వాగ్య, ధస్మా, సోనీ, గాంధీ, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండలంలోని బచ్చోడులో గట్టిగుండ్ల వెంకన్న స్మారక స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, వీరస్వామి, బింగి శ్రీను, వల్లపు భిక్షం, గురవయ్య, ఉప్పయ్య, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఖమ్మంఅర్బన్: కార్తీకమాసం సందర్భంగా శనివారం పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ మేరకు నగరంలోని 4వ డివిజన్ శ్రీ అభయ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేశారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్దఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయం ప్రాంగణంలోని ధ్వజస్తంబం వద్ద, శివుడు, నాగదేవత విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించారు. భక్తులకు దేవాలయ కమిటీ ద్వారా తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.